ఎపిఇపిడిసిఎల్‌కు రెండు జాతీయ అవార్డులు

ప్రజాశక్తి - విశాఖపట్నం

వినియోగదారులకు సేవలందించే క్రమంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్)కు రెండు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. ఇండిపెండెంట్ పవర్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐప్పయ్) ఆధ్వర్యంలో కర్ణాటకలోని బెల్గాంలో శనివారం అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి తరఫున సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం ఈ అవార్డులను అందుకున్నారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలందించడంలో ఉత్తమ పనితీరు కనబరిచినందుకు ఎపిఇపిడిసిఎల్ జాతీయ స్థాయిలో అవార్డును కైవసం చేసుకుంది. దీంతో పాటు వినియోగదారుల్లో అవగాహన పెంపుదల అంశంలోనూ అవార్డును సొంతం చేసుకుంది. రెండు జాతీయ అవార్డులు లభించడం పట్ల సంస్థ సిఎండి పృథ్వీతేజ్ ఇమ్మడి సంతోషం వ్యక్తం చేశారు.

ఎన్నికల్లేని సహకార సొసైటీలు

- త్రీమెన్ కమిటీలతోనే కాలం
- రైతులకు సక్రమంగా అందని రుణాలు

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

సహకార సంఘాలు ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. గత ఆరేళ్లుగా ఎన్నికలు నిర్వహించకుండా అధికార పార్టీకి చెందిన నాయకులతోనే త్రీ మేన్ కమిటీలు వేయగా వాటిని పొడిగిస్తూ కొనసాగిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 299 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పిఎసిఎస్) ఉన్నాయి. 2013 ఎన్నికల నాటికి దాదాపు 4 లక్షల మంది సభ్యులు, సుమారు 2.5 లక్షల మంది ఓటర్లున్నారు. 2013, డిసెంబరులో కొన్ని, 2014, జనవరి, ఫిబ్రవరిలో మరికొన్ని సంఘాలకు ఎన్నికలు జరిగాయి. అయిదేళ్లకొసారి జరగాల్సిన ఎన్నికలను వైసిపి ప్రభుత్వం త్రీమెన్ కమిటీ పేరిట పాలకవర్గాలను నియమించింది.

ఆరేళ్లుగా ఎన్నికలు లేవు

గత టిడిపి ప్రభుత్వం వీటికి 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించగా 2018లో పదవీ కాలం ముగిసింది. దీంతో పాత పాలకవర్గాలనే ఒక సంవత్సరం పాటు కొనసాగించింది. 2019 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా జనరల్ ఎలక్షన్స్ తెరమీదకు రావడంతో సొసైటీ ఎన్నికలు వాయిదా పడ్డాయి. అప్పటి నుంచి త్రీమెన్ కమిటీలు కొనసాగుతుండగా ఈ నెల 31 తో పలు కమిటీల గడువు ముగియనుంది. మరో 6 నెలలు పాటు పాత కమిటీలనే పొడిగిస్తూ ఈ నెలాఖరులోగా ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందని కాకినాడ జిల్లా సహకార అధికారి దుర్గా ప్రసాద్ తెలిపారు. మూడేళ్ల క్రితమే ఎన్నికల కోసం కసరత్తు చేసినా ప్రక్రియ ఆగింది. 2020లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రకటన సమయంలోనే నిర్వహిస్తారని అంతా ఊహించారు. సొసైటీల వారీగా ఓటర్ల జాబితాలను కూడా సిద్ధం చేశారు. పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసినా ఎన్నికలు జరగలేదు. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం పాలకవర్గాలను రద్దు చేసి 2019 ఆగస్టులో త్రిసభ్య కమిటీలను తెర పైకితెచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు వీటి పదవీ కాలాన్ని పొడిగిస్తూనే ఉన్నారు. మరోసారి ఆరు నెలలు పదవీ కాలాన్ని పొడిగించనున్న నేపథ్యంలో ఇప్పట్లో ఎన్నికలు ఉండే అవకాశం లేదు. ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు ఉన్నాయి. ఆ ఎన్నికల తర్వాత ఏర్పడే నూతన ప్రభుత్వమైనా సహకార ఎన్నికలు ప్రక్రియను పూర్తి చేయాలని రైతాంగం ఎదురుచూస్తోంది.

భూమి ఉన్న రైతులు, కౌలు రైతులు సొసైటీల్లో సభ్యత్వం కలిగి ఉన్నారు. వీరికి స్వల్ప, దీర్ఘకాలిక రుణాలు, వాణిజ్య యంత్రాలను సంఘాలు అందజేస్తుంటాయి. రైతుల భూముల తనఖాపై సహకారశాఖ రుణాలను అందిస్తారు. అయితే గత ఆరేళ్లుగా రెగ్యులర్ పాలకవర్గాలు లేకపోవడంతో తమకు సేవలు సక్రమంగా అందడం లేదని రైతులు వాపోతున్నారు. లక్ష్యాలు చేరుకోకపోవడంలో వెనుకబడిపోతున్నాయి. రావాల్సిన బకాయిలు సక్రమంగా వసూలు కావడం లేదు. దీంతో సహకార సంఘాలు అభివృద్ధి నానాటికీ కుంటుపడుతోంది. ఎన్నికలు జరపాలని సహకార సంఘాల ప్రతినిధులు గతంలో హైకోర్టులో పిటిషన్ కూడా వేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించాలని గతంలో హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించినా పట్టనట్లే వ్యవహరిస్తోంది.

ఆదిత్యలో 12న సదస్సు

ప్రజాశక్తి-కాకినాడ

ఆదిత్య డిగ్రీ కళాశాలలో ఈ నెల 12న ఎపి ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో 'ఉన్నత విద్యలో సంస్కరణలు- యువత సాధికారత'పై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఇవిఎల్.నాయుడు తెలిపారు. ఎపి స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ ఉన్నత విద్యను భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మార్చడంలో అనేక కార్యక్రమాలను చేపట్టిందన్నారు. ఇది విద్యార్థుల్లో విశ్లేషణాత్మక నైపుణ్యాలు, వ్యవస్థాపకత, సమాజ సేవను అభివృద్ధి చేయడానికి, భవిష్యత్ సవాళ్లకు, తాజా సాంకేతికతల్లో భవిష్యత్తు నైపుణ్యాల కోసం వారిని సిద్ధం చేయడానికి కూడా కృషి చేస్తోందన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ అందజేత

ప్రజాశక్తి-కాకినాడ

సముద్రంలో బోటు దగ్ధమై మునిగిపోయిన ఘటనలో బాధితునికి సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.25 లక్షల సాయం మంజూరు అయ్యింది. కాకినాడకు చెందిన కాటాడి రామకృష్ణ పరమహంస బోటు దగ్ధం కావడంతో కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా, ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి ఆర్థిక సహాయానికి సంబంధించిన ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘాల నాయకులు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ భానుగుడి నుంచి ఆశ్రమ్ స్కూల్ జంక్షన్ వరకు హరిత నగరాల్లో భాగంగా రూ.1.90 కోట్ల 15వ ఆర్థిక సంఘ నిధులతో ప్రతిపాదించిన స్మార్ట్‌రోడ్ నిర్మాణ పనులకు, మాజీ మంత్రి, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు శనివారం శంఖుస్థాపన చేశారు. నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావుతో పాటు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఎస్ఇ పి.సత్యకుమారి, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, బెజవాడ సత్యనారాయణ, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ జంగా గగారిన్, ఎంపిపి గోపిశెట్టి పద్మజ బాబ్జి, ఐ.శ్రీను, రాజారావు, వెంకటలక్ష్మి కృష్ణ పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబానికీ ఇంటి పట్టా

ప్రజాశక్తి-కాకినాడ, కాకినాడ రూరల్

పట్టాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ ఎంఎల్‌సి, ఎంఎల్ఎ

ప్రతి పేద కుటుంబానికి ఇళ్లు నిర్మించే లక్ష్యంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున చేపట్టిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా తెలిపారు. శనివారం కాకినాడ జెఎన్‌టియు ఎదురుగా ఉన్న మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పేదలందరికీ ఇళ్లు పథకం కింద ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎంఎల్‌సి కర్రి పద్మశ్రీ, కలెక్టర్ కృతికా శుక్లా, కాకినాడ రూరల్ ఎంఎల్ఎ కురసాల కన్నబాబు, జాయింట్ కలెక్టర్ సివి.ప్రవీణ్ ఆదిత్య, కుడా ఛైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ఇతర ప్రజాప్రతినిధులు హాజరై ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ కాకినాడ రూరల్ నియోజకవర్గానికు సంబంధించి కాకినాడ పట్టణంలోని 8 వార్డుల్లో గుర్తించిన 2,812 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తామన్నారు. గతంలో కాకినాడ రూరల్ నియోజకవర్గంలో 2,400 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, ఇప్పటివరకు 8 వార్డుల్లో 5,224 మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. కాకినాడ నగర పరిధిలోని 50 వార్డులలో గుర్తించిన 33,855 మంది అర్హులైన లబ్ధిదారుల కోసం 12 లేఔవుట్‌లలో ఇళ్ల స్థలాలు సిద్ధం చేసినట్టు చెప్పారుర. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు అవసరమైన సామాగ్రి, మౌలిక సదుపాయాలను రూ.750 కోట్ల నిధులతో కాకినాడ నగర లబ్ధిదారులకు కేటాయించిన లేఔవుట్‌లలో అభివద్ధి చేశామన్నారు. జిల్లావ్యాప్తంగా 1,20,000 ఇళ్ల పట్టాలు మంజూరు చేశామని, 70 వేల ఇళ్లు మంజూరు అయ్యాయని అందులో ఇప్పటివరకు 30 వేల వరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.వెంకటరావు, అడిషనల్ కమిషనర్ సిహెచ్.నాగ నరసింహారావు, కాకినాడ ఆర్‌డిఒ ఇట్ల కిషోర్, సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ జమ్మలమడక నాగమణి, మాజీ మేయర్ సుంకర శివ ప్రసన్న, జెడ్‌పిటిసి ఎన్.రామకృష్ణ, ఎఎంసి ఛైర్మన్ పశుపులేటి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్‌జెడి నాగమణి

రానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని అందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు ప్రణాళిక రూపొందించుకోవాలని కాకినాడ విద్యాశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి ఆదేశించారు. శనివారం మాధవపట్నంలో జిల్లా పరిషత్ నృత పాఠశాలను ఆమె ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులు పరిశీలించారు. విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులు చదవడం, రాయడం నైపుణ్యాలను పరిశీలించారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. తదను గుణంగా తగు కార్యాచరణ రూపొందించుకోని కృషి చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి.గోవింద రాజులు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎపిపి కామేశ్వరరావుకు పలువురి అభినందన

ప్రజాశక్తి - సామర్లకోట

పెద్దాపురం అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎన్నికైన రాగం కామేశ్వరరావును శనివారం సామర్లకోటలో పలువురు వైసిపి నాయకులు ఘనంగా సన్మానించారు. కామేశ్వరరావు వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబును పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా దొరబాబు సమక్షంలో ఆయనను దళిత నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఊబా జాన్ మోసెస్ మాట్లాడుతూ 175 సంవత్సరాల చరిత్రలో పెద్దాపురం నియోజకవర్గంలో జిల్లా సీనియర్ సివిల్ కోర్టులో ఒక దళితుడికి ఎపిపి పదవి దక్కడం చాలా గర్వకారణంగా ఉందన్నారు. మాల మహానాడు నాయకుడు లింగం శివ కుమార్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా దళితులకు సివిల్ కోర్టులో చోటు లేకుండా పోయిందని, దవులూరి దొరబాబు ఆధ్వర్యంలో దళితులకు అవకాశం రావడం చాలా ఆనందమన్నారు.

10వ రోజు జిజిహెచ్ వర్కర్స్ ఆందోళన

ప్రజాశక్తి-కాకినాడ

శానిటేషన్ వర్కర్స్ ఆందోళన

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్స్ సిఐటియు ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన శనివారం 10వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు సిహెచ్.విజయ్ కుమార్, కామేశ్వరి మాట్లాడుతూ కాంట్రాక్టు సంస్థ తమతో చర్చలు ప్రారంభించడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్స్ అన్నీ పరిష్కారం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. 24 ఏళ్లుగా ఎన్నడూ లేని విధంగా యజమానులు చెల్లించాల్సిన పిఎఫ్, ఇఎస్ఐ కూడా తమ జీతాలు నుండి కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలు విపరీతంగా పెరగడం వల్ల జీతాలు సరిపోవడం లేదన్నారు. బుధవారం నుండి ఆందోళన మరింత తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు, ఆర్.రమేష్, వివిఎన్ కుమార్, దుర్గాప్రసాద్, చంద్రకళ, కుమారి, అరుణ, తలుపులమ్మ, మంగ, బి.శ్రీకాంత్, ఎం.రవి, శ్రీనివాస్, జనార్ధన్, కోటి, ఏసు, నరేంద్ర పాల్గొన్నారు.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ వేగవంతం

ప్రజాశక్తి - పెద్దాపురం

సచివాలయాల ద్వారా ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని మండల విస్తరణ అధికారి కె.రాజశేఖర్ అన్నారు. శనివారం జి.రాగంపేట, గోరింట గ్రామ సచివాలయాల్లో నిర్వహిస్తున్న రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎన్‌టిఆర్ రమేష్, విఆర్ఒ బాబూరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యలో డీవార్మింగ్ డే

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలెం ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫార్మసీలో శనివారం నేషనల్ డీవార్మింగ్ డేని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ రవిశంకర్ దీనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అపోలో షైన్ డాక్టర్ ఉమా శంకర్ మాట్లాడారు.

పరీక్షా కేంద్రంలో ప్రిన్సిపల్

ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక నవోదయ విద్యాలయలో 9, 11 తరగతులకు సంబంధించి ఖాళీల భర్తీ కోసం శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని నవోదయ ప్రిన్సిపాల్ కమలం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 6 కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహించినట్టు చెప్పారు. 1587 మంది ఈ పరీక్ష నిమిత్తం దరఖాస్తు చేసుకోగా పరీక్షకు 1070 మంది హాజరయ్యారన్నారు. పరీక్షా కేంద్రాలను ఎంఇఒ శర్మ, చౌదరి, నవోదయ ప్రిన్సిపాల్ కమలం పర్యవేక్షించారు.

సామాజిక సేవ ద్వారా బాధ్యతగా మెలగాలి

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న శేషారెడ్డి తదితరులు

సామాజిక సేవ ద్వారా బాధ్యతగా మెలగాలని ప్రముఖ మాస్టర్ మోటివేటర్ షఫీ యువతకు పిలుపునిచ్చారు. చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా ఆదిత్య విద్యా సంస్థల అధినేతలు నల్లమిల్లి శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం దంపతుల సహకారంతో ప్రతిరోజు గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ వద్ద చేస్తున్న నిత్యాన్నదానం 1000 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన 'ఓ యువతా మేలుకో 'కార్యక్రమంలో షఫీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు, యువత చదువులతో బాటు సమాజాన్ని కూడా అధ్యయనం చేయాలన్నారు. సమాజానికి మన వంతు సహాయం చేయాలని, సేవా భావం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు.

1000 మంది రక్తదానం

చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా నిరంతరాయంగా అన్నదానం జరుగుతుండగా 1000 రోజులు పూర్తయిన సందర్భంగా సుమారు వెయ్యి మంది విద్యార్థులు, యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా చేయూత సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, అలీం మాట్లాడుతూ యువతీ, యువకులు సామాజిక సేవలో ముందున్నప్పుడే సమాజంలో రక్త కొరతతో ఇబ్బంది పడేవాళ్లు, ఆకలితో అలమటించేవాళ్లు లేకుండా చేయగలమని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో ముందుగా ఆదిత్య విద్యాసంస్థల అధినేతలు శేషారెడ్డి, లక్ష్మీరాజ్యం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. యువతీ, యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్త దానం చేయడం ఎంతో సంతోషంగా ఉందని కాకినాడ సిటీ ఎంఎల్ఎ ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ ఛైర్మన్ వైడి.రామారావు, రోటరీ ప్రెసిడెంట్ రవికృష్ణ, స్వామి డెవలపర్స్ అధినేత స్వామి, ఇనోదయ హాస్పిటల్స్ ఆదిత్య, సోల్ మేట్స్ గ్రూప్ అధినేత అజయ్ రెడ్డి, రెడ్డి సంక్షేమ సంఘ అధ్యక్షులు బుచ్చిరెడ్డి, ధరణి కన్‌స్ట్రక్షన్స్ రమణారావు, చేయూత ఆర్థిక కార్యదర్శి చింతా నారాయణ మూర్తి, అసోసియేట్ అధ్యక్షులు షేక్ వలీ బాషా పాల్గొన్నారు.

నీటి పిల్లుల సంరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-తాళ్లరేవు

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అటవీ సిబ్బంది

చిత్తడి నేలల పరిరక్షణకు ఎంతగానో దోహదపడే నీటి పిల్లులను సంరక్షించాల్సిన బాధ్యత ప్రజలందరిదీనని అటవీ శాఖ సిబ్బంది తెలిపారు. ప్రపంచ నీటిపిల్లి దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తడి నేలల రాజు, కోరంగి అభయారణ్యం రారాజును కాపాడుకుందాం అనే నినాదంతో అటవీశాఖ శనివారం విస్తృత అవగాహనా కార్యక్రమాన్ని చేపట్టింది. దీనిలో భాగంగా మండల పరిధిలోని మత్స్యకార గ్రామాల్లో అటవీ శాఖ అధికారులు మహేష్, ప్రసాద్, ధనుంజయరావు నీటిపిల్లి వల్ల అభయారణ్యానికి కలిగే ప్రయోజనాలను వివరించారు. వాతావరణ పరిస్థితులతోపాటు, పారిశ్రామికాభివృద్ధి తదితర కారణాలతో నీటిపిల్లుల సంఖ్య తగ్గుతోందన్నారు. కోరింగ అభయారణ్యంలో ఇటీవల చేపట్టిన గణనలో కేవలం 115 నీటి పిల్లులు మాత్రమే ఉన్నట్లు గుర్తించామన్నారు. వీటి సంఖ్య తగ్గితే పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. అనారోగ్యంగా ఉన్న మత్స్య జాతులను ఇవి తిని పర్యావరణ సమతుల్యతకు దోహదం చేస్తాయన్నారు. నీటి పిల్లులను వేటాడరాదని కోరారు. మహేష్, సత్యన్నారాయణ, విష్ణు, అప్పారావు, మాజీ సర్పంచ్ బర్రే లక్ష్మీనరసింహరాజు పాల్గొన్నారు.

లయన్స్ విజన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-కాకినాడ రూరల్

సమాజ సేవను సామాజిక బాధ్యతగా చేపట్టి నిస్సహాయుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ సేవలు అభినందనీయమని లయన్స్ జిల్లా గవర్నర్ వేలూరి సూర్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఎపిఐఐసి కాలనీలో అడబాల ట్రస్ట్ కార్యాలయంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరులకు సహాయం చేయడంలో కలిగే ఆనందం ఎనలేనిదన్నారు. ఆ దిశగా లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ శాశ్వత ప్రాజెక్టుగా ప్రతినెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరుకుల పంపిణీ చేయడమే కాక పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మహిళలు ఆర్థిక అభివృద్ధికి ఉచితంగా కుట్టు శిక్షణలో తర్ఫీదు నివ్వడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా అడబాల రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో గవర్నర్ దంపతులను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షురాలు ఎంవిఎస్ఎల్.ప్రసూన అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎం.విశ్వేశ్వరరావు, ఎం.శాస్త్రి, ఎన్.శ్రీదేవి రెడ్డి, బి.శ్రీవాణి, ఎం.రమాసుందరి, చల్లా విజయలక్ష్మి, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఇప్పుడో ఇల్లు కట్టి ఇవ్వడం కష్టమయ్యా.. పంటలు సాగు చేస్కోని.. వచ్చే డబ్బులతో ఇళ్లు నిర్మించుకోమంటున్నారు సారు..!!

మత సామరస్యానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-పిఠాపురం

సభలో పాల్గొన్న పీఠాధిపతి ఉమర్ ఆలీషా, వివిధ మతాల ప్రతినిధులు

మత సామరస్యానికి, సర్వమత సౌభ్రాతత్వానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని శ్రీ విశ్వ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా పిలుపు నిచ్చారు. ఆశ్రమ ప్రాంగణంలో శనివారం పీఠం వార్షిక జ్ఞాన మహాసభల్లో శనివారం రెండో రోజు జరిగిన సభలో ఆలీషా మాట్లాడారు. భగవద్గీత, రామాయణం, బైబిల్, ఖురాన్ వంటి మత గ్రంథాలలో ఉండే అద్భుతమైన జ్ఞానశక్తి మానవత్వాన్ని సూచిస్తుందని పేర్కొన్నారు. ఆధ్యాత్మికత అనేది మానవత్వపు విలువల యొక్క మార్గదర్శకంగా ఉంటుందన్నారు. అనంతరం పీఠం రూపొందించిన తత్వమార్గము 4వ భాగం, లైట్ ఆఫ్ నాలెడ్జ్ గ్రంథాలు, కరపతాలను ఆయన ఆవిష్కరించారు. సభలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న శ్రీవెంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం విసి రాణి సదాశివమూర్తి, శాసనసభ మాజీ డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ ప్రాచీన సాంప్రదాయాల్లో భాగమైన సూఫీ వేదాంత దర్శనాన్ని తరతరాలుగా ఈ పీఠం మానవాళికి అందిస్తోందన్నారు. విశ్వ మానవాళికి ఆధ్యాత్మిక విద్యను, విజ్ఞానాన్ని, సంస్కారాన్ని నేర్పుతున్న పీఠాధిపతి ఉమర్ ఆలీషా సేవలను కొనియాడారు. ట్రస్ట్ ద్వారా పీఠం అందిస్తున్న సేవలను ప్రశంసించారు. సభలో పాల్గొన్న ముఖ్య అతిథులు, వివిధ మతాలకు చెందిన ప్రతినిధులతో చేతులు కలిపి మత సామరస్యానికి, సర్వమత సౌభ్రాతత్వానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఆలీషా పిలుపు ప్రతిజ్ఞ చేయించారు అఖిల భారత భవానీ దీక్షా పీఠం పీఠాధిపతి శివరామకృష్ణ స్వామీజీ, విశ్రాంత న్యాయమూర్తి విశ్వనాథం, ప్రణవ ఆశ్రమం పీఠాధిపతి సుమిత్రానంద సరస్వతి, హ్యూమన్ రైట్స్ ప్రొడక్షన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రాష్ట్ర వైస్ ఛైర్మెన్ బొంగరాల రవిచంద్రన్, పిఠాపురం సిఐ శ్రీనివాసు, డిఎంఅండ్ హెచ్ఒ డాక్టర్ నరసింహనాయక్ తదితరులు సభలో పాల్గొన్నారు. సభలో నిర్వహించిన సంగీతవిభావరిలో ఎ.ఉమ, ఐ.ఉమ ఆలపించిన కీర్తనలు సభికులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, పీఠం మీడియా కన్వీనర్ ఆకుల రవితేజ తదితరులు పాల్గొన్నారు.

అభివాదం చేస్తున్న అంగన్‌వాడీల నాయకులు

చరిత్రలో నిలిచిన అంగన్‌వాడీల పోరాటం

ప్రజాశక్తి-కాకినాడ

అంగన్వాడీలు చేసిన 42 రోజుల పోరాటం ఆంధ్రప్రదేశ్ కార్మికోద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు దువ్వా శేషబాబ్జి కొనియాడారు. కాకినాడ ధర్నాచౌక్‌లో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి అభినందనసభ జిల్లా అధ్యక్షురాలు దడాల పద్మ అధ్యక్షతన నిర్వహించారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్ కుమార్, ఎపి అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏరుబండి చంద్రావతి మాట్లాడారు. అంగన్వాడీ సంఘం రాష్ట్ర ప్రభుత్వం ముందు పెట్టిన 12 డిమాండ్లలో 11 డిమాండ్లు సాధించామని, ఒక్క రూపాయి నష్టపోకుండా సమ్మె కాలపు వేతనాలు చెల్లించేలాగా, ఒక్కరిని కూడా ఉద్యోగం నుంచి తొలగించకుండా అంగన్వాడీ ద్యమం ఘనవిజయం సాధించిందని తెలిపారు. ఈ అభినందన సభలో కాకినాడ జిల్లా అంగన్వాడి సంఘం నాయకులు దాడి బేబీ, ఎస్తేర్ రాణి, రాజేశ్వరి, వీరవేణి, నాగమణి, జిల్లా కోశాధికారి రమణమ్మ, నగర కార్యదర్శి జ్యోతి, రాష్ట్ర కమిటీ సభ్యురాలు బాలం లక్ష్మి, వరలక్ష్మి, చామంతి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-చాగల్లు

మండలంలోని చాగల్లు గ్రామ పంచాయతీ శివారు జగనన్న కాలనీ పరిధిలో శనివారం ఒక వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. మృతిరాలి తండ్రి కొనకల గోవింద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం...చాగల్లు గ్రామానికి చెందిన జాన దుర్గ (25)కు మీనానగరంలోని మేనమామ శివరామకృష్ణతో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఒక పాప, బాబు జన్మించారు. అయితే ఇటీవల కాలంలో భార్య, భర్త మధ్య విబేధాలు చోటుచేసుకున్నాయి. దీంతో గత ఆరు నెలలుగా భర్తను విడి ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటుంది. ఈ నేపథ్యంలోనే గత 3 రోజులుగా ఆమె కన్పించక పోవడంతో చుట్టుపక్కల గ్రామాల్లో బంధువులను కుటుంబ సభ్యులు ఆరా తీశారు. ఈ తరుణంలోనే శనివారం ఆమె ఉంటున్న జగనన్న కాలనీ సమీపంలోని జీడిమామిడి తోటలో ఒక చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. ఈ మేరకు మృతిరాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకుని ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కోడి పందేలపై పోలీసుల దాడి 16 మంది అరెస్టు

ప్రజాశక్తి - చాగల్లు

మండలంలోని చిక్కాల గ్రామ శివారులో పామాయిల్ తోటలో శుక్రవారం రాత్రి కొంతమంది వ్యక్తులు కోడిపందాలు ఆడుతుండగా పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు కోళ్లు, రెండు కత్తులు, రూ.7,150 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.నాగరాజు తెలిపారు. మండలంలో ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఖఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

6,100 కేజీల పిడిఎస్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి - రాజానగరం

రాజానగరం జాతీయ రహదారిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహించిన దాడుల్లో 6100 కేజీల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లా కల్లూరు నుంచి గొల్లప్రోలు మండలం బి.ప్రత్తిపాడు గ్రామానికి పిడిఎస్ బియ్యాన్ని తరలిస్తున్నట్లు విజిలెన్స్, రెవెన్యూ, సివిల్ సప్లయ్స్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో రాజానగరం జాతీయ రహదారిలో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని. నిలుపుదల చేసి తనిఖీలు చేపట్టగా 122 ప్లాస్టిక్ బస్తాల్లో సుమారు 6100 కేజీలు బియ్యాన్ని గుర్తించారు. బియ్యం విలువ రూ.2,77,550 ఉంటుందని అధికారులు వెల్లడించారు. ఈ బియ్యాన్ని కల్లూరు చుట్టుపక్కల గ్రామాల్లో తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి కెజి రూ.23లకు కొనుగోలు చేసి బి-ప్రత్తిపాడు సమీపంలో ఉన్న గ్రామాలకు ఇటుక బట్టి కార్మికులు, చేపల చెరువులకు రూ.26లకు విక్రయించేందుకు తరలిస్తున్నట్లు తెలిపారు. బియ్యంతోపాటు, బియ్యాన్ని రవాణా చేస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు వెల్లడించారు. 6-ఎ కేసు, డ్రైవర్ సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్‌పి కెవిఎస్‌వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రవరం రీజనల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిఘా పెట్టినట్లు తెలిపారు ఎవరైనా పిడిఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసినా, అమ్మినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ నాగవెంకటరాజు, జిల్లా పౌర సరఫరాల అధికారి విజయ్ భాస్కర్, రాజానగరం సిఎస్‌డిటి ఎం.కమల్‌సుందర్, కానిస్టేబుల్స్ లోవరాజు, కిషోర్ రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగిన వ్యాపారి మృతి

ప్రజాశక్తి -సామర్లకోట

అప్పుల బాధ తాళలేక గడ్డి మంతు తాగిన సామర్లకోట సంపెంగ తోట ప్రాంతానికి చెందిన కిరాణా వ్యాపారి చోణట్ల మణికంఠ (30) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. స్థానిక పోలీసుల వివరాల ప్రకారం కిరాణా వ్యాపారం చేసుకుంటున్న మణికంఠ వ్యాపార పరంగా అప్పుల బాధకు లోనయ్యాడు. దానితో మనస్తాపానికి గురై శుక్రవారం రాత్రి గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. అది గమనించిన కుటుంబికులు అతడిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. పోలీసులు కేసు తర్యాప్తు చేస్తున్నారు.

ప్రశాంతగా నవోదయ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - సామర్లకోట

నవోదయ విద్యాలయలో 9వ తరగతి, ఇంటర్‌లో చేరేందుకు విద్యార్థులకు ప్రవేశ పరీక్షలు శనివారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఎంఇఒ వై.శివరామ కృష్ణయ్య పర్యవేక్షణలో గవర్నమెంట్ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ బాలికొన్నత పాఠశాలల్లో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలకు 192 మందికి గాను, 117 మంది హాజరయ్యారని ఎంఇఒ చెప్పారు.

విజ్ఞాన దాయకంగా అటల్ ఫ్యాకల్టీ

ప్రజాశక్తి-గండేపల్లి

సూరంపాలేం ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం నిర్వహించిన 6 రోజుల ఫ్యాకల్టీ నైపుణ్య అభివద్ధి కార్యక్రమం విజ్ఞాన దాయకంగా విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఎఐసిటిఇ టీచింగ్ అండ్ లెర్నింగ్ అకాడమీ స్పాన్సర్ చేసిన స్పీచ్ అండ్ ఇమేజ్ ప్రాసెసింగ్ ఫర్ డిసీజ్ ప్రిడిక్షన్' అనే అంశంపై నిర్వహిరంచిన జాతీయ కార్యక్రమంలో ప్రముఖ రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నట్టు చెప్పారు. ఈ వేడుకలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శ్రీనివాస రెడ్డి, డీన్ డాక్టర్ జి.సురేష్, డీన్ అడ్మిన్ ప్రొఫెసర్ వి.సత్యనారాయణ, విభాగాధిపతి డాక్టర్ ఎన్.రాధ, డాక్టర్ కె.విష్ణువర్ధన్ రెడ్డి, డాక్టర్ శ్రీదేవి గామిని, కో-ఆర్డినేటర్ ఎస్.జగదీష్ పాల్గొన్నారు.

ఎన్నికల వేళా నిరాశే...

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ జిల్లా వాసులను తీవ్ర నిరాశకు గురిచేసింది. ఓటాన్ బడ్జెట్‌లో జిల్లాకు ప్రాధాన్యత ఉంటుందని అందరూ భావించారు. కాని ఎలాంటి నిధులు విదల్చకపోవడంతో జిల్లా ప్రజలు ఉసూరుమన్నారు. ఫలితంగా ఎక్కడి సమస్యలు అక్కడే తిష్టేశాయి. అధిక శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధార పడి జీవిస్తున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కీలకమైన కాలువల ఆధునికీకరణకు సైతం నిధులు విదల్చలేదు. ఈ పనులను వైసిపి అధికారంలోకొచ్చిన తర్వాత పూర్తిగా అటకెక్కించింది. కేవలం తూతూమంత్రంగా తొలగింపునకు మాత్రమే పరిమితమైంది. కాటన్ బ్యారేజీ మరమ్మతుల కోసం గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సైతం ఖర్చు చేయలేదు. కోనసీమ వాసుల చిరకాల కల అయినా కోటిపల్లి నర్సాపురం రైల్వేలైను మాటను పూర్తిగా మరిచారు. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన వాటాలో కొంత మేరైనా నిధులు విడుదలవుతాయని చూశారు. కాని అలాంటి కూతలు లేకుండానే రెడ్ సిగ్నల్ వేశారు. గోదావరి నదీ కాలుష్య నివారణ అంటూ కేటాయించిన నిధులు కాగితాలు దాటి ఆచరణ రూపం దాల్చలేదు. కీలకమైన ప్రాజెక్టుల అమలు కోసం కేంద్రంలోని బిజెపి నిధుల రావాల్సి ఉంది. అయితే ఆ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రాకపోవడంతో నిధులు విడుదల చేయట్లేదు. తాజాగా విడుదల చేసిన బడ్జెట్‌లోనూ కేంద్రం నుంచి నిధులు వస్తాయని చెప్పటం విమర్శలకు దారితీస్తోంది. అధికార వైసిపితో పాటు ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు పోటీపడి మద్దతు తెలపడమే ఈ దుస్థితికి కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆశాలపై నిర్బంధం

కనీస వేతనం కోసం ఆశాలు చేపట్టిన చలో విజయవాడను భగ్నం చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన అక్రమ అరెస్టులు, నిర్బంధాలు జిల్లాలో చర్చనీయాంశంగా మారాయి. ఒకరోజు ముందు నుంచే పోలీసులు ఆశాలపై ప్రయోగించింది. అర్ధరాత్రి అపరాత్రి తేడా లేకుండా పోలీసులు ఆశాలను ఎక్కడికక్కడ అరెస్టు చేశారు. టిక్కెట్ కొనుక్కొని బస్సుల్లో వెళ్తున్న వారిని సైతం అడ్డగించి కిందకు దింపేశారు. ఈ నిర్బంధాలను వామపక్షాలు, ప్రజాసంఘాలు తీవ్రంగా ఖండించాయి. టిడిపి,జనసేన నాయకులు సైతం పలుచోట్ల నిర్బంధాలను వ్యతిరేకించారు. నిర్బంధాలకు నిరసనగా చేపట్టిన ధర్నాలు విజయవంతమయ్యాయి.

మరో పక్క జిల్లాలో రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కేంద్రంగా రాజకీయ పార్టీలు భవిష్యత్తును పరీక్షించుకునేందుకు పోటీ పడుతున్నాయి. అధికార వైసిపి ఇప్పటికే అభ్యర్థులను దాదాపుగా ఖరారు చేసింది. టిడిపి, జనసేన కూటమి తెలుగుదేశం-జనసేన కూటమి త్వరలోనే తమ అభ్యర్థుల జాబితాను ప్రకటించేందుకు సమాయత్తం అవుతుంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ సైతం తన ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పిసిసి చీఫ్ వైఎస్.షర్మిల జిల్లాలో పర్యటించింది. చాగల్లులో రచ్చబండ, తునిలో రోడ్‌షోలతో ఒకరోజు పర్యటనను విజయవంతం చేసుకున్నారు. అధికారపార్టీతో పాటూ టిడిపి, జనసేన కూటమిపైనా ఆమె పలు విమర్శలు చేశారు. కేంద్రంలో బిజెపికి అంటకాగుతున్న పార్టీలను సాగనంపాలని పిలుపునిచ్చారు. వైసిపి, టిడిపిలకు ఓటేస్తే బిజెపికి ఓటు వేసినట్టేనని జిల్లా ప్రజలను హెచ్చరించారు. ప్రత్యేక హోదా, నిధుల రాష్ట్ర వాటాలను ప్రస్తావించారు. అవన్నీ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమంటూ చెప్పుకొచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే మొదటి సంతకం ప్రత్యేక హోదాపైనే రాహులు చేస్తారని చెప్పారు. జిల్లాలో కనుమరుగైన కాంగ్రెస్ పార్టీకి షర్మిల టూర్ ఉత్సాహాన్ని నింపింది. మరోపక్క కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసేందుకు పలువురు దరఖాస్తులను సైతం చేసుకుంటున్నారు. మెత్తంగా షర్మిల రాకతో జిల్లాలో హస్త వాసి ఎలా మారుతుందో వేచిచూడాలి.

యానాం వార్తలు

మత్స్యకారులకు త్వరలో రూ.94 కోట్ల పరిహారం

ప్రజాశక్తి - యానాం

వివరాలు వెల్లడిస్తున్న ఎంఎల్‌ఎ అశోక్

యానాం నియోజక వర్గ పరిధిలోని మత్స్యకారులకు అందాల్సిన ఒఎన్‌జిసి నష్టపరిహారం అతి త్వరలో లబ్ధిదారుల అకౌంట్లలోకి జమ అవుతుందని ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రూ.94 కోట్ల7 లక్షల నష్టపరిహారం ఇప్పటికే అందాల్సి ఉందని, తాను ఇటీవలి న్యూఢిల్లీ వెళ్లి ఒఎన్‌జిసి ఉన్నతాధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిహారం ఇచ్చేవిధంగా వారిని ఒప్పించినట్లు తెలిపారు. మొత్తం 5,462 మందికి గాను రూ.71 కోట్ల 76 లక్షల 9 వేలను పుదుచ్చేరి మెంబర్ సెక్రెటరీ వారి ఖాతాలో ఆ సొమ్ము జమ చేశారని సోమవారం ఆ ప్రక్రియ పూర్తవుతుందన్నారు. అనంతరం ఆ సొమ్మును ముఖ్యమంత్రి రంగసామి, మత్స్యశాఖామంత్రి లక్ష్మీనారాయణ తదితరులు యానాం వచ్చి ఒక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి లబ్ధిదారులకు అందజేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే కొంత మొత్తం రూ.23 కోట్లు ప్రభుత్వ ఖాతాలో ఉన్నాయని ఆ విధంగా మొత్తం రూ.94 కోట్ల 7 లక్షల 69 వేలు లబ్ధిదారుల ఖాతాలో జమఅవుతాయన్నారు. పరిహారం పంపిణీలో రాజకీయాలకు తావులేకుండా పూర్తి పరిహారం ప్రతి మత్స్యకారుడుకు ఇవ్వాలని ఆ సోమ్ము వారికే దక్కాలన్నదే తన ప్రధాన అభిమతన్నారు. పరిహారం పంపిణీ అనంతరమే అన్ని విషయాలను మాట్లాడతానని స్పష్టం చేశారు.

ఎంఎల్‌ఎ అశోక్‌ను కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి - యానాం

ఎంఎల్‌ఎ అశోక్‌ను సత్కరిస్తున్న ఎస్‌పి

యానాం నూతన ఎస్‌పి రాజశేఖరన్ స్థానిక ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్‌ను శనివారం ఆయన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఎస్‌పిని ఎంఎల్‌ఎ అశోక్ అభినందించారు. అనంతరం పలు సమస్యలపై చర్చించారు. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావును ఎస్‌పి రాజశేఖరన్ మర్యాదపూర్వకంగా కలిశారు.

జగన్‌కు రాజకీయ సమాధి : అయ్యన్నపాత్రుడు

ప్రజాశక్తి-కోటనందూరు

సభలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ప్రజలు రాజకీయ సమాధి కట్టాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. శనివారం భీమవరపుకోటలో, పెంటకోట భాస్కర్, సత్యనారాయణ, అల్లంపల్లి నరసింహమూర్తి ఆధ్వర్యంలో టిడిపి తునిఇన్చార్జ్ యనమల దివ్య మీ ఇంటికి మీ దివ్య కార్యక్రమం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో అయ్యన్నపాత్రుడు మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో సహజ సంపద కొల్లగొడుతున్నారని, మద్యపానాన్ని నిషేధం చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చి మద్యాన్ని ఏరులుగా పారించి నకిలీ మద్యాన్ని అమ్ముకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపించారు. యనమల కృష్ణుడు, యనమల దివ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాడి వీరభద్రరావు, అంకమ్మ రెడ్డి బుల్లిబాబు, గాడి రాజబాబు, అంకపరెడ్డి రమేష్ ,షేక్ నవాజ్ జానీ, దంతులూరి చిరంజీవ రాజు, బంటుపల్లి వెంకటేశ్వరరావు ,మోత్కూరు వెంకటేష్, మేడప రెడ్డి జోగి బాబు, ఎర్ర చిన సత్యానారాయణ ,గంట అమ్మాజీ, నెమ్మది సత్యానారాయణ, బోడపాటి సత్యానారాయణ, లగుడు సత్యానారాయణ పాల్గొన్నారు.

పలువురికి చైర్‌పర్సన్ పరామర్శ

ప్రజాశక్తి- సామర్లకోట

సామర్లకోటలో ఇటీవల మరణించిన పలువురి కుటుంబాలను మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ కృష్ణమూర్తి శనివారం పరామర్శించారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన మాజీ కౌన్సిలర్, మున్సిపాలిటీ ప్రజారోగ్య విభాగం డేటా ఎంట్రీ ఆపరేటర్ పొడుగు చిట్టిబాబు కుటుంబాన్ని, అనారోగ్యంతో మృతి చెందిన కౌన్సిలర్ నక్కా లలిత కుటుంబాన్ని, ఇటీవల మృతి చెందిన మిరియాల రాజు కుటుంబాలను చైర్‌పర్సన్ పరామర్శించారు. ఆమె వెంట కౌన్సిలర్ మిరియాల మేరి తదితరులు ఉన్నారు.

శ్రీప్రకాష్‌లో ఎన్‌సిసి సర్టిఫికెట్ పరీక్ష

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక రామారావుపేట లోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూలులో శనివారం ఎన్‌సిసి విద్యార్థులకు 'ఎ' సర్టిఫికెట్ అర్హత పరీక్ష నిర్వహించారు. కాకినాడ 18వ బెటాలియన్ కల్నల్ వివేక్ సావన్ గురుధర్, సుబేదార్ మేజర్ హేమంత్ కుమార్, హవల్దార్ రఫీ జైన్, కేమ్ రాజ్ తాపా ఆధ్వర్యంలో ఈ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు ప్రత్తిపాడు, హంసవరం, పెద్దాపురం వంటి ఐదు పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కాకినాడ గ్రూపు కమాండర్ కల్నల్ సవ్యసాచి దాస్ పరీక్షను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సిసి శిక్షణ ద్వారా క్రమశిక్షణ అలబడుతుందన్నారు. డిఫెన్స్ వంటి వాటిలో చేరడానికి ఈ సర్టిఫికెట్ ఎంతో దోహదపడుతుందన్నారు.

ఆదిత్యలో సిస్టం బూట్ క్యాంప్

ప్రజాశక్తి-గండేపల్లి

మండలంలోని సూరంపాలెం ఆదిత్య గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇసిఇ విభాగంలో 'ఎంబెడెడ్ సిస్టం' అనే కోర్సుకు బూట్‌క్యాంప్ విజయవంతంగా నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎలక్ట్రానిక్ రంగంలో వినియోగించే ఎంబెడెడ్ సిస్టం బోర్డులు, వాటి డిజైనింగ్, సాఫ్ట్‌వేర్ వినియోగించే పద్ధతి, వాటి అప్లికేషన్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్టెక్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ సంస్థకు చెందిన కాకి ఆదిత్య, ప్రోగ్రామ్ మేనేజర్ చరణ్ మారం, శిక్షణ అధిపతిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ మేడపాటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఇటువంటి బూట్‌క్యాంపుల వల్ల విద్యార్థులు నైపుణ్యాలను మెరుగు పరిచి వారి ఎలక్ట్రానిక్స్ విభాగంలో ఉద్యోగాల సాధనకు మరింత దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ డాక్టర్ జి.సురేష్, వి.సత్యనారాయణ, ఇసిఇ విభాగం అధిపతి. డాక్టర్ ఎన్.రాధ,డాక్టర్ కర్ణ విష్ణు వర్ధన్ రెడ్డి, టి. రవీంద్ర పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలని ధర్నా

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి

కొత్తమూలపేట ఎస్ఇజెడ్ కాలనీకి చెందిన దారా ప్రకాష్, దారా చందులపై కులం పేరుతో దూషించి కత్తితో దాడి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని మాల మహానాడు నాయకుడు గుబ్బల రాజు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక కొత్తపల్లి పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గుబ్బల రాజు మాట్లాడుతూ నిందితులు ఆవాల మణికంఠ, ఆవాల లోవరాజులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ప్రకాష్, చందు కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నాలో దారా వెంకట్రావు, బందిలి సూరిబాబు, దడాల సత్తిబాబు, ఆలపు శేషుబాబు, దడాల పాదాలు, అయితే రమణ, దడాల సుందర్రావు, చిట్టమూరి రాంబాబు, తార నాగభూషణం, వడ్డి నాగలక్ష్మి, గడ్డం లక్ష్మణుడు పాల్గొన్నారు.

వృత్తి విద్యా కోర్సులు భవితకు దోహదం

ప్రజాశక్తి-శంఖవరం

విద్యార్థులు వృత్తి విద్యా కోర్సుల్లో శిక్షణ పొందితే అవి వారి భవితకు దోహద పడగలవని వృత్తి విద్యా శిక్షకురాలు నాగమణి అన్నారు. శనివారం ఆమె ఎపి సమగ్ర శిక్షణ సంస్థ నిర్వహిస్తున్న వృత్తి విద్యా కోర్సుల్లో భాగంగా శంఖవరం కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల ప్రిన్సిపల్ బి.బాలామణి ఆధ్వర్యంలో 120 మంది విద్యార్థినులు రావికంపాడులోని శివరాం యార్న్స్ ప్రైవేట్ మిటెడ్ స్పిన్నింగ్ మిల్ ఫ్యాక్టరీని రెండు విడతలుగా సందర్శించారు. టెక్స్టైల్స్, టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు స్పిన్నింగ్ యంత్రాల పనితీరు, పత్తి నుండి దారం తయారు చేయడంలో వివిధ ప్రక్రియలను పరిశీలించారు. స్పిన్నింగ్ మిల్ ఇన్చార్జ్ పి.విజయ్ కుమార్ తయారీ విధానాన్ని విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు ఎం.నీలిమ, కె.కృష్ణవేణి, సిహెచ్.కాంతామణి, కెఎంఎస్.రత్నం పాల్గొన్నారు

టిడిపిలో పలువురు చేరిక

రౌతులపూడి : రాజవరం గ్రామంలో వైసిపికి చెందిన పంచాయతీ ఉప సర్పంచ్ సియాధుల ఎర్ర పాత్రుడుతో పాటు పలువురు వార్డు సభ్యులు టిడిపి ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ వరుపుల సత్యప్రభ సమక్షంలో టిడిపిలో చేరారు. పారుపాక పంచాయతీ ఉపసర్పంచ్ కాళ్ల మంగతో పాటు నలుగురు వార్డు మెంబర్లు వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. టిడిపి అధికారంలోకి రాగానే పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న అందరికీ సముచిత స్థానం కల్పిస్తానని సత్యప్రభ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏలేశ్వరం ఎంపిపి గొల్లపల్లి బుజ్జి, రౌతులపూడి ఎంపిపి గంటిమల్ల రాజ్యలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు సత్యనారాయణ, మాజీ ఎంపిపి భాస్కర్ బాబు, నాయకులు తిరుమల వెంకన్నదొర, కృష్ణవర్మ, మౌళి ఉన్నారు.

అరాచక పాలనపై లోకేష్ శంఖారావం

కాకినాడ : వైసిపి ప్రభుత్వ అరాచకాలపై, జగన్ సాగిస్తున్న నిరంకుశ పాలనపై తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పూరించారని కాకినాడ సిటీ మాజీ ఎంఎల్‌ఎ వనమాడి కొండబాబు పేర్కొన్నారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా యువగళం పాదయాత్ర నిర్వహించి ప్రజా సమస్యలపై పోరాటం చేశారన్నారు. శంఖారావం కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గాల్లో పర్యటించన్నారని తెలిపారు. 50 రోజుల్లో 120 అసెంబ్లీ నియోజకవర్గాల్లో రోజుకు 3 అసెంబ్లీ నియోజకవర్గాల్లో శంఖారావం కార్యక్రమం ద్వారా ఆయా ప్రాంతాల్లో పర్యటించి స్థానిక ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తారని తెలిపారు.

పేదల కడుపు నింపేది 'అన్న క్యాంటీన్'

కరప : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల కడుపు నింపేవారని కటకంశెట్టి ప్రభాకర్ అన్నారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం వ్యాప్తంగా ప్రతి గ్రామంలో అన్న క్యాంటీన్ ద్వారా మధ్యాహ్నం భోజనం అందిస్తూన్న కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కటకంశెట్టి వెంకట ప్రభాకర్ ఆధ్వర్యంలో సంచార అన్న క్యాంటీన్ ప్రారంభించి 200 రోజులైన సందర్భంగా కరప గ్రామం మార్కెట్ సెంటర్ వద్ద అన్న క్యాంటీన్ ద్వారా ప్రజలకు భోజనాలను పంపిణీ చేశారు. టిడిపి నాయకులు నున్న దొరబాబు, డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కటకంశెట్టి ప్రభాకర్ పాల్గొని భోజనాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తుల సతీష్, ఎర్రంనాటి మార్కండేయులు, గోవిందరాజు, కట్టా రంగారావు, కోన వెంకటలక్ష్మి, గుబ్బల భాస్కరరావు, పి.భవాని, కంటిపూడి వెంకటరత్న చౌదరి, తోట కృష్ణ, జనసేన నాయకులు రెడ్డి రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తే చర్యలు

పిఠాపురం : ట్రాఫిక్ ఇబ్బంది కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ జి.శ్రీనివాస్ హెచ్చరించారు. శనివారం ఉప్పాడ బస్టాండ్ సెంటర్ నుంచి చర్చి సెంటర్ వరకు ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వ్యాపారస్తులు తమ దుకాణాలకు వచ్చే వారి వాహనాల పార్కింగ్ ట్రాఫిక్ ఎటువంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంటవెంట పట్టణ ఎస్ఐ మురళీమోహన్, సిబ్బంది ఉన్నారు.

నాగమల్లేశ్వరిని సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

నాగమల్లేశ్వరికి పలువురి అభినందన

ప్రజాశక్తి-పిఠాపురం

స్థానిక సూర్యరాయ డిగ్రీ కళాశాలలో అడ్వైజరీ కమిటీ చైర్‌పర్సన్ అల్లవరపు నాగమల్లేశ్వరిని వైసిపి కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల అధికార ప్రతినిధిగా నియమించడంపై కళాశాల కరస్పాండెంట్ మహమ్మద్ చాంద్ బాషా హర్షం వ్యక్తం చేశారు. శనివారం కళాశాలలో నాగ మల్లేశ్వరిని ఘనంగా సన్మానించారు. నిస్వార్థంగా తాను చేసిన సేవను పార్టీ గుర్తించి తనకు రాష్ట్ర మహిళా విభాగ కమిటీలో ప్రతినిధిగా తనను నియమించడం చాలా ఆనందంగా ఉందని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మహమ్మద్ హబీబ్ బాషా, మహమ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

వల్లభ స్వామికి రూ.3.88 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతి గ్రామంలోని శ్రీ శృంగార వల్లభ స్వామి ఆలయానికి శనివారం ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ.3,09,50, అన్నదానం విరాళాల ద్వారా రూ.73,077, కేశఖండన ద్వారా రూ 5,920, తులాభారం ద్వారా రూ 650 ఆదాయం సమకూరిందని ఆలయ ఇఒ వడ్డి శ్రీనివాసరావు తెలిపారు. యాత్రికులకు ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యాహ్నం మహా అన్నదానం నిర్వహించామన్నారు. యాత్రికులకు ఆలయ చైర్మన్ కర్రి వెంకట జగదీశ్వరరావు, ఎంపిటిసి కుంచే బుచ్చిరాజు, ధర్మకర్తలు, అర్చకులు పెద్దింటి నారాయణచార్యులు, పురుషోత్తమాచార్యులు, ఆలయ సిబ్బంది కృష్ణ, రమేష్, సత్యనారాయణ, స్వచ్ఛంద సేవకులు అంజనీ కుమార్, గ్రామస్తులు సేవలు అందించారు.

వల్లభ స్వామి ఆలయ ఇఒగా శ్రీనివాసరావు

తిరుపతి గ్రామంలోని శ్రీ శంగార వల్లభ స్వామి ఆలయ ఇఒగా వడ్డి శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఆలయ ఇన్‌ఛార్జి ఇఒగా బాధ్యతలు నిర్వహించిన దేవాదాయ శాఖ జిల్లా అధికారి పులి నారాయణమూర్తి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో పిఠాపురం కుక్కుటేశ్వర స్వామి ఆలయ ఇఒగా బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో వడ్డి శ్రీనివాసరావు బదిలీపై వచ్చారు.

వైకల్య జననాలపై ప్రజలకు అవగాహన

ప్రజాశక్తి - తాళ్లరేవు

వైకల్యంతో శిశువులు జన్మించకుండా ముందుగా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఉమా మనోవికాస కేంద్రం, రిలయన్స్ ధీరూబాయ్ ఎర్లీ ఇంటర్వెన్షన్ కేంద్రం ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో కమ్యూనిటీ హాల్ వద్ద గర్భిణులు, గ్రామస్తులకు పలు విషయాలు వివరించరాఉ.ఉపాధ్యాయురాలు ఉదయకుమారి, కె.నవ్య మాట్లాడారు. మేనరికపు వివాహాలు, బాల్య వివాహాలను నివారించాలని, పౌష్టికాహారం తీసుకోవాలని, గర్భిణులు సకాలంలో వ్యాక్సిన్లు వేయించుకోవాలని తెలిపారు. ఫిజియోథెరపిస్ట్ కె.శ్రీకాంత్ మాట్లాడుతూ ధీరుభాయ్ అంబానీ ప్రత్యేక పాఠశాలలో అందిస్తున్న ప్రత్యేక విద్య, నడవలేని పిల్లలకు ఫిజియోథెరపీ, మాటలు రాని పిల్లలకు స్పీచ్ థెరపీ ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్రం ఇంచార్జ్ గోపాలరావు, ఎస్ఎం స్టీఫెన్, పి.సత్తిబాబు, డి.నాగమణి, వికలాంగుల సంఘం నాయకులు సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆసరా లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

పెద్దాపురం : డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కులను వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు పంపిణీ చేశారు. చంద్రమాంపల్లిలో శనివారం తాటిపర్తి, దివిలి, చంద్రమాంపల్లి, తిరుపతి గ్రామాలకు సంబంధించి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, ఎంపిపి పెంకే సత్యవతి, వైస్ ఎంపిపి మిర్యాల రాజా పాల్గొన్నారు.

'శంఖారావం'ను జయప్రదం చేయాలి

జగ్గంపేట : తెలుగుదేశం పార్టీ యువ నేత నారా లోకేష్ చేపట్టనున్న శంఖారావంను ప్రతి ఒక్కరూ విజయవంతం చేయలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు జ్యోతుల నెహ్రూ అన్నారు. శనివారం మండలంలోని ఇర్రిపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాదయాత్ర ఎక్కువ గ్రామాల్లో సాగకపోవడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. రోజుకి 3 నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తారని తెలిపారు. టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసి వచ్చి ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోతుల మోహనరావు, చదరం చంటి, రాము, తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-పిఠాపురం

పట్టణంలోని స్థానిక కెవికెటి ఫంక్షన్ హాల్లో శనివారం జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ సుమారు 55 దేశ, విదేశాలకు చెందిన మల్టీ నేషనల్ కంపెనీలు హాజరై అభ్యర్థుల నుంచి దరఖాస్తులు తీసుకొని ఇంటర్వ్యూ నిర్వహించి వారికి ఉద్యోగ నియామకాలను చేపట్టారన్నారు. జనసేన పార్టీ ఎన్నారై కన్వీనర్ కె.శశిధర్ యాదవ్ ఇంటర్వ్యూల్లో ఎంపికైన 586 మందికి నియామక పత్రాలు అందజేశారు.

వైద్య సేవలు సక్రమంగా అందించాలి

ప్రజాశక్తి - సామర్లకోట

ప్రజలకు వైద్య సేవలు సక్రమంగా అందించాలని ఎంఎల్‌ఎ నిమ్మకాయల చిన్నారాజప్ప అన్నారు. శనివారం సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి కమిటీ సమన్వయ సమావేశం సూపరిండెంటెంట్ డాక్టర్ అమల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌ఎ చినరాజప్ప మాట్లాడారు. ఆసుపత్రిలో సదుపాయాలు, వైద్యుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి జనరేటర్ సదుపాయం ఉన్నా దానికి ఇనస్టాలేషన్ పనులు పూర్తి కాక ఉపయోగంలోకి రాలేదని డాక్టర్ అమల ఎంఎల్ఎకు వివరించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిని ఆనుకుని ఆక్రమణలపై ఎంఎల్‌ఎ ఆరా తీశారు. ఆసుపత్రిలో రోగుల సదుపాయాలను ఆయన పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీస్, బలుసు వాసు, గొల్తి సత్య నారాయణ, ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

తూర్పుగోదావరి జిల్లా, నల్లజర్ల మండలం, పుల్లలపాడు గ్రామానికి చెందిన పెనుమర్తి భాను మేఘన, D/o. పెనుమర్తి ఆనందరావు అను నాకు పాస్‌పోర్టు నెంబరు **V2586480** కలదు. నా యొక్క పాస్‌పోర్టు జిరాక్స్ నిమిత్తం మా ఇంటి దగ్గర నుండి నల్లజర్ల ఆటోలో వెళ్ళుచుండగా పడిపోయినది. దొరికినవారు ఈ అడ్రసుకు, ఫోన్ నెంబరుకు తెలియజేయగలరు.

పెనుమర్తి భాను మేఘన
D/o. పెనుమర్తి ఆనందరావు
డో.నెం. 1-76/1, హైస్కూల్ రోడ్డు
పుల్లలపాడు, నల్లజర్ల మండలం
తూర్పుగోదావరి జిల్లా - 534112
సెల్: 9398004501

మహారాజశ్రీ పెద్దాపురం సీనియర్ సివిలు జడ్జి వారి కోర్టు

S.O.P. No. 1 of 2024

Between:

1. అమ్ముల వెంకట పద్మావతి
2. కోటిపల్లి శివనారాయణ
3. కోటిపల్లి వీర వెంకట సుబ్బారావు
4. కోటిపల్లి కృష్ణ చైతన్య
5. కోటిపల్లి కళ్యాణి -పిటిషనర్లు

AND

Nil -రెస్పాండెంట్

పిటిషనర్లు లేటు కోటిపల్లి సోమేశ్వరి గారి కరూర్ వైశ్య బ్యాంకు, పెద్దాపురంలోని లాకర్ తెరచుకొనుటకు అనుమతి కోసం పై నంబర్ పిటిషన్ దాఖలు చేసినారు. పై నంబరు పిటిషన్ నందు ఎవరికైన ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టున **ది. 28-02-2024వ తేదీన వాయిదా అయి వున్నది.** ఆరోజున స్వయంగా గానీ, న్యాయవాదితో గాని శ్రీ కోర్టు వారి ముందు హాజరు అయి వారి వాదనను తెలుపుకొనవచ్చును. లేని యెడల శ్రీ కోర్టు వారు పిటిషనరులకు అనుకూలంగా తీర్పు చెబుదురు.

(శ్రీ కోర్టు వారి ఆర్డర్ ప్రకారం)

ఎం.కె.మొహియిద్దీన్
అడ్వకేట్, పెద్దాపురం